కొత్తమ్మతల్లి..కాపాడమ్మా..

కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి తమను చల్లగా కాపాడాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులు ప్రసాదాలను వితరణ చేశారు. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

– కోటబొమ్మాళి


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్


ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసకు చెందిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ వేసిన అమ్మవారి రూపం


ఉచిత ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు




ఆరోగ్యశాఖ, గ్రామీణ తాగునీటి శాఖ, విద్యుత్ శాఖల స్టాల్స్

క్లుప్తంగా

మద్యం దుకాణాలు బంద్


టెక్కలిలో మూత పడిన మద్యం దుకాణం

టెక్కలి: మద్యం కొత్త పాలసీ విధానంతో సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్‌లు సమ్మెకు దిగడంతో మంగళవారం టెక్కలిలో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. కొత్త పాలసీ విధానం పూర్తి స్థాయిలో అమలు కాకుండా ఆంక్షలు విధించడంతో సిబ్బంది ఒక్కసారిగా సమ్మె బాట పట్టారు. అంతే కాకుండా బేవరేజ్ నుంచి మద్యం సరఫరా సైతం నిలిపివేసి మందుబాబులకు షాకిచ్చారు.

ఉత్సాహంగా కళాశాల ఫ్రెషర్స్ డే


డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

కంచిలి: కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ బి. జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీతారాం నాయుడు, కళాశాల అధ్యాపకులు హరిప్రసాద్, నవ్యశ్రీ, దాసు, బబిత, వేణుగోపాల్, మురళీ, తిరుపతి, సోమేష్, వాసు పాల్గొన్నారు.

కళాకారుడి మృతికి సంతాపం


కామేశ్వరరావు (ఫైల్)

పలాస: కాశీబుగ్గకు చెందిన ప్రముఖ కవి, కళాకారుడు, ఉద్యోగ విరమణ పొందిన తెలుగు భాషోపాధ్యాయులు చీగటి కామేశ్వరరావు (80) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామానికి చెందిన కామేశ్వరరావు రంగస్థలంలో అనేక అవార్డులు పొందారు. కవిగా గొప్ప ఖ్యాతి గడించారు. నృత్యకారునిగా, గాయకునిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. పలాస, కాశీబుగ్గ లలిత కళారంగ సమితితో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. ఈయన మృతిపై లలిత కళారంగ సమితి అధ్యక్షుడు బూర్లి కోటేశ్వరరావు, తెప్పల కృష్ణమూర్తి, ప్రముఖ జానపద కళాకారుడు డాక్టరు కుమార్‌నాయక్ తదితరులు సంతాపం తెలియజేశారు.

ఓటరు నమోదుపై అవగాహన


ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోంపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని సోంపేట పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలలు సందర్శించి ఓటరుగా నమోదయ్యే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాలిబందు, చంద్రశేఖర్, ప్రతినిధులు జోగారావు, తారకేశ్వరరావు, పురుషోత్తం, వేణుగోపాల్ పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి


టెక్కలి: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ, అధ్యాపకులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తుగా గాంధీ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో గాంధీ చిత్రాపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులంతా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో లమ్మత మధు, అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, ల్యూక్‌పాల్, ఎ.రామారావు, వాసుబాబు, కోటేశ్వరరావు, కుమారి, కవిత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి శ్మశానవాటికకు 15వ ఆర్థిక సంఘం నిధులు లక్ష రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అలాగే బద్దేపుపేట గ్రామంలో లక్ష రూపాయలతో కల్వర్టు పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులపై జాలిచూపాలి

● వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యాంప్రసాద్‌రెడ్డి

కవిటి: డయాలసిస్ రోగులపై ప్రభుత్వం జాలిచూపి వారి వెతలు తక్షణమే తీర్చాలని వైఎస్సార్‌సీపీ నేత, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం కవిటిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలు తన దృష్టికి వచ్చినట్లు ఆయన 'సాక్షి'కి వివరించారు. ప్రస్తుతం అక్కడ రోజూ 19 పడకలపై సుమారు 54 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుతున్నాయన్నారు. అయితే అదనంగా సరిపడా డయాలసిస్ యంత్రాలు, గదులు అందుబాటులో లేకపోవడంతో 31 మంది రోగులు నిరీక్షిస్తున్నట్టు గమనిస్తున్నామన్నారు. ఇలాంటి సమస్యను అధిగమించేందుకు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పది పడకలతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని.. దాన్ని అమలు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చల్ల దేవరాజు ఉన్నారు.


డయాలసిస్ కేంద్రంలో రోగితో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

హామీలను నెరవేర్చాలి

పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు మొత్తం హామీలను అమలు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం ధర్నా చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని పటిష్ట పర్చాలని, విశాఖ ఉక్కును కాపాడాలని, వరద ప్రభావిత ప్రాంతాల రైతుల రుణాలను మాఫీ చేయాలని, ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం అందజేయాలని, పలాస రెవెన్యూ డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డు వాసుదేవరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, కార్మిక సంఘం నాయకులు కుత్తుం దుష్యంతు, కె.లోకనాథం, పి.అప్పారావు, కె.ఈశ్వరమ్మ, సుందరమ్మ, జోగారావు, పాపయ్య, జగదీష్, రామక్రిష్ణ, ముసలయ్య ఉన్నారు.


మాకన్నపల్లి సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వలంటీర్ల ఆందోళన

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే వలంటీర్లను కొనసాగించి రూ.10 వేలు వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని వజ్రపుకొత్తూరు మండల వలంటీర్ల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ ఈశ్వరమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం నేతలు పైల వామనమూర్తి, సీమల గోపాలక్రిష్ణ, దాసరి నర్సింహమూర్తి, ఎం.భాస్కరరావు ఉన్నారు.


ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న వలంటీర్లు

వరద బాధితులకు వితరణ

ఇచ్ఛాపురం: విజయవాడ వరద బాధితుల కోసం ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాల తరఫున ఒక లక్షా నాలుగు వేల రూపాయలను అందజేసినట్లు ఏపీ ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి మంగళవారం అందజేశామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తులసీదాస్‌రెడ్డి, కె.రామారావు, పి.చిరంజీవి, కె.వి.రమేష్ బాబు, బి.వి.ప్రసాదరావు, వాసుదేవరావు, జోహర్‌ఖాన్, కృష్ణమూర్తి, డిల్లేశ్వరరావు ఉన్నారు.


ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

విద్యార్థికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చింతాడ ముకుందరావు గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, సాలినపుట్టుగ యువత స్పందించారు. 2018 తెలుగు సేవా సదన్ బృందం, ఉపాధ్యాయులు రూ.15 వేలు, సాలినపుట్టుగ యువత రూ.15,300 సేకరించారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజని, గోవిందరావు, వెంకటరమణ, శ్రీహరి, వజీర్ పాల్గొన్నారు.


విద్యార్థి తల్లికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రఘువర్మ ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్సీ రఘువర్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కంచిలి: మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. డోలగోవిందపురం, మఠం సరియాపల్లి, మకారంపురం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సిబ్బందిని కలిశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మను ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

చంద్రబాబుకు చెంపపెట్టు


మాట్లాడుతున్న దానయ్య

కాశీబుగ్గ: తిరుమల లడ్డూ వ్యవహారంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చంద్రబాబు సర్కారుకు చెంప పెట్టని వైఎస్సార్‌సీపీ నాయకులు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మంగళవారం ఆయన పలాసలో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడం చేతకాక లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ లేనిపోని ఆరోపణలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగదన్నారు. వందరోజుల పాలనలోనే రాష్ట్రాన్ని రావణకాష్టంగా కూటమి ప్రభుత్వం మార్చేసిందని మండిపడ్డారు. భక్తుల మనోభావలతో కూటమి ప్రభుత్వం ఆడుకోవడం తగదన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన దుష్యంత్

టెక్కలి రూరల్: మునసబుపేట గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలినీలాపురం గ్రామానికి చెందిన యువకుడు దుష్యంత్ గాయపడ్డాడు. టెక్కలి నుంచి తన గ్రామమైన తెలినీలాపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. నౌపడ నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన దుష్యంత్‌ను 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

కొత్తమ్మతల్లికి పూజలు


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

టెక్కలి: టెక్కలి పాలకేంద్రం వెనుక ఉన్న కొత్తమ్మతల్లి ఆలయంలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త రాజేశ్వరి ఆధ్వర్యంలో మొదటి రోజు ఘటాలతో ఊరేగింపు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు.

దసరా సందడి



పలాస: రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో నరకాసుర వధన


టెక్కలి ఎంజేపీ ఏపీ పాఠశాలలో విద్యార్థినుల వేసిన దసరా బొమ్మల్లో అమ్మవారి రూపాలు


పలాస: బాలికల నృత్యాభినయం


ఇచ్ఛాపురం రూరల్: బలరాంపురం విద్యార్థులు ప్రదర్శిస్తున్న మహిశాసుర మర్దిని నృత్య రూపకం


కాశీబుగ్గ: శివాజీనగర్‌లోని ఓ పాఠశాలలో దుర్గాదేవి అలంకరణలో ఐదో తరగతి చిన్నారి ప్రగతి

పాఠశాలల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పాఠశాలలకు సెలవు. గురువారం నుంచి దసరా సెలవులు. దీంతో ముందస్తుగానే పాఠశాలల్లో దసరా వేడుకలను మంగళవారం నిర్వహించారు. పిల్లలు దుర్గాదేవిగా అలరించారు. సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పిల్లలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు.


కవిటి: పెద్ద ఎర్ర గోవిందపుట్టుగలో మహిషాసుర మర్దిని వేషధారణలో చిన్నారులు

క్రీడాకారుడికి అభినందన

కాశీబుగ్గ: జాతీయస్థాయి 43వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు హర్యాన రాష్ట్రంలో ఇటీవల జరిగాయి. దీనిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం పొందింది. రాష్ట్ర జట్టు తరఫున పలాసకు చెందిన జి.ఛాయకిరణ్ పాల్గొన్నాడు. దీంతో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షులు కోత పూర్ణ చంద్రరరావు ఛాయకిరణ్‌ను మంగళవారం సత్కరించి అభినందించారు.


ఛాయకిరణ్‌కు అభినందిస్తున్న పూర్ణచంద్రరరావు

ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పద్మనాభాపురం గ్రామంలోని ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం కొత్త యూనిట్‌ను ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ ఏవీకే శాస్త్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు


మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అక్క, తమ్ముడిపై దాడి

టెక్కలి రూరల్: రావివలస గ్రామంలో మంగళవారం తగాదా చోటుచేసుకుంది. ఈ ఘటనలో పాతకాలనీకి చెందిన అక్క,తమ్ముడుపై అదేవీధికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు దాడిచేశారు. పి.లక్ష్మి తన ఇంటివద్ద గుమ్మం కడుగుతుండగా ఆ నీరు పక్కింటి వద్దకు వెళ్లిందనే కారణంగా ఇద్దరు యువకులు లక్ష్మితో పాటు ఆమె తమ్ముడు శేఖర్‌పై దాడిచేశారు. ఈ ఘటనలో అక్క, తమ్ముడు గాయపడడంతో వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. టెక్కలి పోలీసులకు సమాచారం ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఇలవేల్పు, గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శరన్నావరాత్రి ఉత్సవాలను ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి కోసం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. 13వ తేదీన నిమజ్జనోత్సవం ఉంటుంది. అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.


ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు

పొటాష్ ఎరువు వాడాలి

సోంపేట: రైతులు ఖరీఫ్ వరి పంటకు చివరి విడత తప్పనిసరిగా పోటాష్ ఎరువు వేసుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి సూచించారు. బేసిరామచంద్రాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర పరిశీలన చేశారు. ఎరువుల వాడకం, వరి వెదసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహయకులు శ్రీకాంత్, ధనలక్ష్మి ఉన్నారు.

బెంతొరియాల దీక్షకు సంఘీభావం

కవిటి: కవిటిలో బెంతొరియాలు చేపట్టిన రిలే నిరాహారదీక్షను వైఎస్సార్‌సీపీ నాయకుడు సాడి శ్యాంప్రసాదరెడ్డి మంగళవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంతొరియా కులస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నేత సల్ల దేవరాజు, బాగా వేణు ఉన్నారు.